
# చౌలపల్లి వార్డు సభ్యుడిపై దాడి

### పంచాయతీ కార్యాలయంలో ఉద్రిక్తత

**షాద్‌నగర్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** ఫరూక్ నగర్ మండలం చౌలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం బుధవారం రణరంగంగా మారింది. అధికారిక సమావేశం జరుగుతుండగానే కొందరు వ్యక్తులు కార్యాలయంలోకి చొరబడి దౌర్జన్యానికి దిగడం స్థానికంగా కలకలం రేపింది. గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్, కార్యదర్శి, వార్డు సభ్యులు విధి నిర్వహణలో ఉండగా, గ్రామానికి చెందిన సయ్యద్ అక్రమ్ అనే వ్యక్తి లోపలికి వచ్చి కార్యదర్శి శ్రీనివాస్‌తో గొడవకు దిగాడు. కార్యదర్శిని దుర్భాషలాడుతూ ఆయనపై దాడికి ప్రయత్నించగా, అక్కడే ఉన్న వార్డు సభ్యుడు ఇక్రమ్ అలీ వారించే ప్రయత్నం చేశారు. దీంతో ఆగ్రహించిన సయ్యద్ అక్రమ్ తన సోదరులు సయ్యద్ ఇమ్రాన్, సయ్యద్ ఇర్ఫాన్‌లను అక్కడికి పిలిపించాడు. ముగ్గురూ కలిసి వార్డు సభ్యుడు ఇక్రమ్ అలీపై కార్యాలయంలోనే ముకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. సర్పంచ్ జంగయ్య, ఇతర వార్డు సభ్యులు చూస్తుండగానే ఈ ఘటన జరగడం గమనార్హం. ఈ దాడిపై గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ కార్యాలయంలోకి చొరబడి ప్రజాప్రతినిధులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. సాక్షులుగా సర్పంచ్ జంగయ్యతో పాటు వార్డు సభ్యులు సయ్యద్ లతీఫ్, గులాం తహసీన్, సయ్యద్ అబ్దుల్ రజాక్ ఉన్నారు.

### భవనంపై నుండి పడి కార్మికుడు మృతి

**అత్తాపూర్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** భవనంపై నుండి ప్రమాదావ శాత్తు కార్మికుడు పడి మృతి చెందిన విషాద ఘటన రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని అత్తాపూర్ గోల్డెన్ హైట్స్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... అత్తాపూర్ గోల్డెన్ హైట్స్‌లో ఓ అపార్ట్‌మెంట్స్‌లో నిర్మాణ పనులు చేస్తుండగా ఉత్తరప్రదేశ్‌కు చెం దిన కార్మికుడు చందన్ చౌదరి (19) ప్రమాదవశాత్తు 6వ అంతస్తు నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని వెంటనే సమీపంలోని ఆల్ఫా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

# నిబంధనలకు నీళ్లు



కోతకు గురవుతున్న రహదారి

- మూన్నాళ్ల ముచ్చటగా మారిన మీర్జాన్‌పేట్ రోడ్డు
- 10 కి.మీ రహదారి పనులకు పదేళ్లు!
- దశాబ్ద కాలం పట్టినా.. తీరని తిప్పలు
- సైడ్ ప్యాచ్ వేయకపోవడంతో కోసుకుపోతున్న రహదారి
- వర్షం వస్తే రోడ్డు అంచులు కూలి తరచు ప్రమాదాలు
- ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణం!

**కందుకూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** కందుకూరు మండల పరిధిలోని హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారి 765 నుండి మీర్జాన్‌పేట గ్రామం వరకు ఇటీవల నిర్మించిన రోడ్డు నిర్మాణంలో నిబంధనలు పాటించకపోవడం వల్ల అది మూడునాళ్ల ముచ్చటగా మారింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో శ్రీశైలం హైవే నుండి మీర్జాన్‌పేట, నంది వనపర్తి మీదుగా యాచారం మండలం సాగర్ హైవేను కలుపుతూ ఈ రోడ్డు నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు. అయితే, నిధుల విడుదలలో జాప్యం, సమస్యల పరిష్కారంలో ఆలస్యం వల్ల కేవలం 10 కిలోమీటర్ల దూరం ఉన్న ఈ రోడ్డు పనులు పూర్తి కావడానికి దశాబ్ద కాలం పట్టింది. మరోవైపు, మీర్జాన్‌పేట నుండి యాచారం వైపు సుమారు 3 కిలోమీటర్ల దూరం రోడ్డు నిర్మాణం కోసం కాంట్రాక్టర్ ఉన్న రోడ్డును తవ్వి గ్రావిలింగ్ పోసి వదిలివేయడంతో గత మూడున్నర ఏళ్లగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఈ ప్రాంతంలో జరిగిన ఫ్యూచర్ సిటీ గ్లోబల్ సమ్మిట్ కోసం కేవలం 600 మీటర్ల దూరం మాత్రమే అత్యవసరంగా నిర్మించారు. ప్రధానంగా, బీటీ రోడ్డు వేసిన తర్వాత దాని పక్కన ఒక మీటర్ వెడల్పుతో మట్టి (సైడ్ బర్మింగ్) పోయాలి, కానీ ఇక్కడ అది మిగతా 2లో

స్వయంగా ముఖ్యమంత్రే పలుమార్లు సమీక్షలు నిర్వహించి, అధికారులను హెచ్చరించినా క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనుల పరిస్థితి ఓ అడుగు ముందుకు.. ఏడడుగులు వెనక్కి అన్న చందంగా తయారైంది. శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయ పునఃనిర్మాణానికి రూ. 110 కోట్లు మంజూరైనా, పనుల్లో ఏమాత్రం పురోగతి లేకపోవడం విస్మయం కలిగిస్తోంది. మరోవైపు, పట్టణంలో మురుగుకాల్వల పనులను కాంట్రాక్టర్లు తమ ఇష్టారాజ్యంగా వదిలేయడంతో ప్రధాన రహదారులు మురుగుకూపాలుగా మారుతున్నాయి. అధికారులు, కడా ప్రత్యేక అధికారి పర్యవేక్షణ లోపంతో అభివృద్ధి పేరుతో పాత రోడ్లను ధ్వంసం చేస్తూ ప్రజలకు నరకాన్ని చూపిస్తున్నారు. సీఎం ఇలాకాలోనే అధికారుల బేఖాతరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కొడంగల్ ప్రధాన రహదారిలో మురుగుకాల్వ పనులను మధ్యలోనే నిలిపివేసిన దృశ్యం

# సిఎం అడ్డాలో ఆగమాగం

- ★ యేడాదిగా కదలని మురుగు కాల్వల పనులు
- ★ నిధులున్నా నత్తనడక
- ★ అధికారుల పర్యవేక్షణ కరువు
- ★ కొత్త సిసి రోడ్లను అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పేరుతో తవ్వి అర్ధాంతరంగా వదిలేసిన కాంట్రాక్టరు
- ★ శ్రీవారి ఆలయ పునర్నిర్మాణంపైనా నీలినీడలు

**కొడంగల్, ఏప్రిల్ 23 , ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో అభివృద్ధి పనుల తీరు ఆగం ఆగం అవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది కాలంగా మురుగుకాల్వల నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా, అత్యంత నెమ్మదిగా సాగుతున్నాయి. కోట్ల రూపాయల నిధులు కేటాయించినప్పటికీ, క్షేత్రస్థాయిలో పనుల్లో ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. మురుగుకాల్వల నిర్మాణం కోసం ప్రధాన రోడ్ల పక్కన తవ్విన గోతులను నెలల తరబడి పూడ్చకుండా వదిలేయడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో మురుగునీరు రోడ్లపైనే పారుతూ దుర్వాసన వెదజల్లుతోంది. కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యంపై అధికారులు కన్నెత్తి చూడకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పేరుతో రెండేళ్ల క్రితం వేసిన కొత్త సీసీ రోడ్లను సైతం ధ్వంసం చేసి అలాగే వదిలేయడం వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ పనులను పర్యవేక్షించాల్సి న కడా ప్రత్యేక అధికారి ఉదాసీనతపై కూడా అసంతృప్తి వ్యక్తమవుతోంది

మరోవైపు, కొడంగల్‌లోని శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయ పునర్నిర్మాణ పనులు కూడా నత్తనడకనే సాగుతున్నాయి. ప్రభుత్వం రూ. 110 కోట్లు మంజూరు చేసినా, పనుల్లో వేగం పెరగలేదు. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలుమార్లు అధికారులను హెచ్చరించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించి నెలలు గడుస్తున్నా, ఆలయ పనుల్లో కదలిక రావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కొడంగల్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### ఆకస్మిక తనిఖీతో

# కలెక్టర్ హాల్‌చల్

- ప్రభుత్వ హైస్కూల్‌లో వసతుల పరిశీలన
- విద్యార్థులతో ముఖాముఖి
- స్కూల్ సమయంలో బస్సు కావాలని కోరిన తల్లిదండ్రులు
- విద్యార్థుల సంఖ్య పెంచితే ఆర్‌టిసి సర్వీసు నడిపిస్తామని హామీ



పూడూర్ పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

**మేడ్చల్, ఏప్రిల్ 24. ప్రభాతవార్త :** మేడ్చల్ మండలం పూడూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ మను చౌదరి గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని వసతులు, విద్యా ప్రమాణాలను పరిశీలించడంతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ముఖాముఖి నిర్వహించారు. పాఠశాల అభివృద్ధికి తీసుకోవాల్సి న చర్యలపై కలెక్టర్ తల్లిదండ్రులతో ప్రత్యేకంగా చర్చించారు. దూర ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు రవాణా ఇబ్బందిగా ఉందని, పాఠశాలకు స్కూల్ బస్సు కావాలని తల్లిదండ్రులు కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన ఆయన, పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను మెరుగుపరచాలని పాఠశాల అధికారులను ఆదేశించారు. విద్యార్థుల సంఖ్య పెరిగితే, దానికి అనుగుణంగా కొత్త బస్సు అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. పాఠశాలలోని కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లను కలెక్టర్ తనిఖీ చేసి ల్యాబ్ ఇన్‌స్ట్రక్టర్లతో మాట్లాడి ప్రయోగాల నిర్వహణ గురించి తెలుసుకున్నారు. విద్యా ప్రమాణాలను పెంచేందుకు పాఠశాలకు ఎలాంటి అవసరాలు సమకూర్చాలని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, మెనూ ప్రకారం ప్రతిరోజూ భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంట సిబ్బందితో మాట్లాడి వారికి కావాల్సి న వంట సామాగ్రి, పరికరాల అవసరాల గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమారి, డిప్యూటీ తహసీల్దార్ అనూష, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చందన్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### కాళేశ్వరంపై తప్పుడు ప్రచారాలు మానండి

**షాద్‌నగర్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలోని రైతంగానే ఆదుకోవాలనే దృఢ సంకల్పంతో అప్పటి సీఎం కేసీఆర్ 94 వేల కోట్ల నిధులతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ అన్నారు. పిసి ఘోష్ నివేదికపై హైకోర్టు ఇచ్చిన తీర్పుతో కాంగ్రెస్ నేతల తీరులో మార్పు రావాలని, ఇప్పటికైనా కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారాలు మానుకోవాలని సూచించారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా, యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టు పనులను పూర్తిచేసిన కేసీఆర్, హరీష్ రావులను బదులాం చేయాలని ఉద్దేశంతో కాంగ్రెస్ నేతలు వ్యవహరించిన తీరును రాష్ట్ర ప్రజలు గమనించారని, హైకోర్టు తీర్పుతోనైనా నేతల ఆలోచనలు మార్పు రావాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై బ్యారేజీలు, భారీ కెనాల్స్, మినీ కాలువలు ఎన్నో ఉన్నా యని, వాటికి అవసరమయ్యే సబ్స్టేషన్లు, మోటార్లు వంటి మౌలిక వస తులను కల్పించారని గుర్తు చేశారు. మేడిగడ్డ బ్యారేజ్ లోని కేవలం రెండు పిల్లర్లుకు పగుళ్లు వస్తే ప్రాజెక్టు మొత్తం కూలిపోయింది అనే రీతిలో ప్రచారాలు చేయడం సిగ్గుచేటు అన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ తీరును ప్రపంచ దేశాలు సైతం అభినందించాయని, సాగునీటి నిపుణులు సైతం ప్రశంసంచారని పేర్కొన్నారు. నేడు లక్షలాది ఎకరాలకు నీళ్లలో అందిస్తున్న ప్రాజెక్టుపై లేనిపోని ఆరోపణలు చేస్తూ రాజకీయాలకు పాల్పడడం సరికాదని, ఇప్పటికైనా కాళేశ్వరం ద్వారా పూర్తిస్థాయిలో నీళ్లు అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.



నాగర్‌లో నేల వాలిన అరటిపంట

# అకాల నష్టం

- భారీ వర్షానికి ధ్వంసమైన పంటలు-నేల రాలిన మామిడి
- చేలల్లో నీరు నిల్వ ఉండి కుళ్లిపోతున్న కూరగాయలు

**షాబాద్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** షాబాద్ మండలంలో గురువారం సాయంత్రం అకాల భారీ వర్షం కురవడంతో పలు గ్రామాల్లో వ్యవసాయ పంటలు, పూల తోటలు, పండ్ల తోటలు, కూరగాయల సాగు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడిన వర్షం పడటంతో అరటి తోటలు, మామిడికాయలు నేలరాలాయి. పొలాల్లో నీరు నిలిచి పంటలకు నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. ముఖ్యంగా పూల తోటల్లో ఉన్న పంటలు నేలపాలయ్యాయని, కూరగాయల పంటలు పూర్తిగా నాశనం అయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షపు నీరు పొలాల్లో చేరడంతో మిర్చి, టమోట, బెండ, వంగ వంటి కూరగాయల పంటలు కుళ్లిపోతున్నాయని చెప్పారు. అలాగే కొన్ని ప్రాంతాల్లో వరి పంట కోతకు సిద్ధంగా ఉన్న సమయంలో వర్షం పడటంతో నేలకు ఒరిగి దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

### దౌల్తాబాద్‌లో పిడుగుల కలకలం


**-తృటిలో తప్పిన పెను ప్రమాదం**

**దౌల్తాబాద్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** దౌల్తాబాద్ మండలంలో గురువారం కురిసిన అకాల వర్షానికి గుండాల గ్రామంలోని పిచ్చకుంట్ల డాకప్ప ఇంటి ఆవరణలోని కొబ్బరి చెట్టుపై పిడుగు పడడంతో చెట్టు పూర్తిగా కాలిపోయింది. ఆ సమయంలో కుటుంబ సభ్యులంతా ఇంట్లోనే ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. అదేవిధంగా మండలంలోని నందారం గ్రామంలో రాజమూరి రామచందర్‌రెడ్డి కాంపౌండ్‌లోని కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కానప్పటికీ, పిడుగు దాటికి ఇంట్లోని విద్యుత్ వ్యవస్థ షార్ట్ సర్క్యూట్ అయ్యింది. ఒకే రోజు మండలంలో రెండు చోట్ల పిడుగులు పడడంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వర్షం, ఉరుములు వచ్చే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు. ఉరుములు సంభవిస్తున్నప్పుడు చెట్ల కింద,విద్యుత్ స్తంభాల వద్ద ఉండరాదని..పొలాల్లో ఉండేవారు వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని కోరారు. అలాగే ఇంట్లోని ఎలక్ట్రానిక్ పరికరాలను ఆపివేయడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.

# వ్యర్థాల దహనానికి ఎకో బర్నర్

### పర్యావరణ రక్షణకు సరికొత్త అస్త్రం-వికారాబాద్ యువకుడి వినూత్న ఆవిష్కరణ

**ఎకో బర్నర్ వంట, పంట వ్యర్థాల దహనం వల్ల వెలువడే కాలుష్యానికి చెక్ పెట్టేందుకు వికారాబాద్ జిల్లాకు చెందిన ఒక యువకుడు వినూత్న పరిష్కారాన్ని కనుగొన్నాడు. అతి తక్కువ ఖర్చుతో పనిచేసే ఈ ఎకో బర్నర్ వ్యర్థాలను కాల్చడమే కాకుండా, వాటిని నేల సారాన్ని పెంచే అత్యంత విలువైన బయోచార్‌గా మారుస్తుంది. విద్యుత్ అవసరం లేకుండా, తక్కువ పొగతో పనిచేసే ఈ పరికరం భవిష్యత్తులో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందని నిపుణులు భావిస్తున్నారు.**




**ధారూర్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** వంట, పంట వ్యర్థాల దహనం అనేది ప్రస్తుతం దేశవ్యాప్తంగా పర్యావరణవేత్తలను, రైతులను వేధిస్తున్న ప్రధాన సమస్య. ఈ సమస్యకు చెక్ పెడుతూ వికారాబాద్ జిల్లాకు చెందిన ఓ యువకుడు అద్భుతమైన పరిష్కారాన్ని కనుగొన్నారు.

ధారూర్ మండల పరిధిలోని దోర్నాల, కెరెల్లీ తదితర గ్రామాల్లో పత్తి సాగు చేసే రైతులు, పంట కోత అనంతరం మిగిలిపోయే పత్తి కాండాలను వదిలించుకోవడానికి పొలాల్లోనే తగులబెడుతుంటారు. దీనివల్ల వెలువడే విపరీతమైన పొగతో అటు పర్యావరణం కలుషితమవడమే కాకుండా, ఇటు ప్రజలు శ్వాసకోశ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ఈ క్షేత్రస్థాయి ఇబ్బందులను గమనించిన సిఐఎఫ్, ఎన్ఐటిఐ ఆయోగ్ ఫెలో బి. మోహన్ వెంకట్ సాయి కృష్ణ, అతి తక్కువ ఖర్చుతో పనిచేసే ఎకో బర్నర్ యూనిట్‌ను అభివృద్ధి చేశారు. ఈ పరికరం కేవలం వ్యర్థాలను కాల్చడమే కాకుండా, వాటిని నేల సారాన్ని పెంచే అత్యంత విలువైన బయోచార్‌గా మారుస్తుంది. సాధారణ పద్ధతులతో పోలిస్తే ఈ ఎకో బర్నర్ ద్వారా 25 శాతం తక్కువ పొగ వెలువడుతుందని, దీనికి ఎటువంటి విద్యుత్ అవసరం లేదని సాయి కృష్ణ వివరించారు. ఎక్కడికైనా సులభంగా తరలించి ఉపయోగించుకునేలా దీనిని రూపొందించడం రైతులకు ఎంతో ఊరటనిచ్చే అంశం. ప్రస్తుతం ప్రాథమిక దశలో ఉన్న ఈ ఆవిష్కరణను మరింత మెరుగు పరిచేందుకు, పొగను పూర్తిగా అరికట్టేలా ఎగ్జాస్ట్ ఫిల్టర్ వ్యవస్థను కూడా ఆయన సిద్ధం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో విజయవంతంగా ట్రయల్స్ పూర్తి చేసుకుంటున్న ఈ ఎకో బర్నర్, భవిష్యత్తులో పంట వ్యర్థాల దహన సమస్యకు దేశవ్యాప్తంగా ఒక ఆదర్శవంతమైన పరిష్కారంగా మారుతుందని నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన ఈ వినూత్న ఆలోచన పర్యావరణ హిత వ్యవసాయం దిశగా ఒక కీలక అడుగుగా నిలుస్తోంది.



బస్సులు లేక బోసిపోయిన జెబిఎస్ ఫ్లాట్ ఫారాలు

# రెండో రోజూ సమ్మె సెగ

- స్తంభించిన రవాణా వ్యవస్థ- డిపోలకే పరిమితమైన 80 శాతం బస్సులు
- ఆకాశాన్నంటిన ఆటో, క్యాబ్ ధరలు
- ప్రయాణికులపై అదనపు భారం
- కిక్కిరిసిన మెట్రో రైళ్లు

**హైదరాబాద్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** హైదరాబాద్‌లో గురువారం నాడు ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె రెండో రోజుకు చేరుకోవడంతో నగరం అతలాకుతలమైంది. టీజీఎస్ ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో తమ న్యాయమైన కోర్కెలను తీర్చాలని కోరుతూ కార్మికులు విధులను బహిష్కరించారు. దీనివల్ల గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సుమారు 80 శాతం బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. తెల్లవారుజామున 5 గంటల నుంచే బస్సులు బయటకు రాకపోవడంతో ప్రయాణికులు బస్టాపుల వద్ద పడిగాపులు కాస్తూ తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, రేతిఫైల్ కాంప్లెక్స్, జూబ్లీ బస్టేషన్ వంటి కీలక ప్రాంతాల్లో బస్సుల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ముఖ్యంగా జేబీఎస్ నుండి కరీంనగర్, సిద్దిపేట, నిజామాబాద్ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి న ప్రయాణికులు బస్సులు లేక దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. కంటోన్మెంట్, పికెట్ వంటి డిపోల్లో చాలా తక్కువ సంఖ్యలో మాత్రమే బస్ సర్వీసులు నడిచాయి. కార్మికులు, డ్రైవర్లు, మెకానిక్లతో సహా వందలాది మంది సిబ్బంది సమ్మెలో పాల్గొనడంతో బస్సు చక్రం కదలలేదు. బస్సులు లేకపోవడాన్ని ఆసరాగా చేసుకున్న ఆటోలు, క్యాబ్‌ల యజమానులు భారీగా రేట్లు పెంచేశారు. సాధారణ ఛార్జీల కంటే రెండు మూడు రెట్లు అధికంగా డబ్బులు వసూలు చేయడంతో సామాన్య ప్రజలు, మహిళా ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారు. మరోవైపు, వేలాది మంది ప్రయాణికులు మెట్రో రైళ్లను ఆశ్రయించడంతో మెట్రో స్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. ఒక్క రోజే అదనంగా 1.75 లక్షల మంది మెట్రోలో ప్రయాణించారని అధికారులు తెలిపారు. టికెట్ కౌంటర్ల వద్ద భారీ క్యూ లైన్లు కనిపిస్తూ, నగర రవాణా వ్యవస్థ మొత్తం సమ్మె సెగతో అట్టుడికిపోయింది.

### ఎక్స్‌ప్రెస్‌వే పై కారు పల్టీ

**అత్తాపూర్ ఏప్రిల్ 23,ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ పివిఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే పై యాక్సిడెంట్ అయింది. పిలర్ నం.241 వద్ద వేగం గా వెళ్తున్న కారు అదుపు తప్పి ఒక రోడ్డుపై నుంచి మరో రోడ్డుపైకి ఎగిరి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో కొంతమంది యువకులు తీవ్రంగా గాయపడ్డారు. అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. గాయపడిన వారిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కస్టమర్ల నగదు భద్రతకు పెద్దపీట వేయండి

### బ్యాంకు అధికారులకు సిపి సజ్జనార్ సూచన

**హైదరాబాద్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :** బ్యాంకు అధికారులు కేవలం ఖాతాల ఓపెనింగ్ టార్గెట్స్ వెంట పడకుండా, కస్టమర్ల భద్రతకు పెద్దపీట వేయాలని హైదరాబాద్ పోలీస్ కమిష నర్ వీసీ సజ్జనర్ సూచించారు. ఒక్క కస్టమర్ కూడా సైబర్ నేరాల బారిన పడకుండా చూడట మే ప్రాథమిక లక్ష్యంగా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీలో గురువారం మ్యూల్ ఖాతాల నియంత్రణపై బ్యాంకు అధికారులతో ఆయన సమన్వయం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్బీఐ రీజినల్ డైరెక్టర్ చిన్మయ్ కుమార్, అడిష నల్ సీపీ ఎం. శ్రీనివాసులుతో పాటు 45 ప్రభు త్వ, ప్రైవేటు బ్యాంకులకు చెందిన 75 మంది ఉన్నతాధికారులు హాజరయ్యారు ఈ సందర్భం గా సీపీ సజ్జనర్ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న మ్యూల్ ఖాతాలను అరికట్టేందుకు 'సేఫ్ కస్టమర్ చాలెంజ్'ను బ్యాంకులు స్వీకరిం చాలని కోరారు. ఈ క్రమంలో ప్రతి బ్యాంకు శాఖ 'జీరో మ్యూల్ అకౌంట్స్'లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఏ బ్యాంకు శాఖలోనూ సైబర్ బాధితులు ఉండకూడదని, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్)లో నమోదయ్యే ఫిర్యాదుల ఆధారంగా ఆయా బ్రాంచీల పనితీరును అంచనా వేసుకోవాలని స్పష్టం చేశారు. బ్యాంకు మేనేజ్మెంట్లు ఖాతాల సంఖ్యను కాకుండా, కస్టమర్ల భద్ర తనే ఉద్యోగుల కీలక పనితీరు సూచికగా పరిగ ణించాలని హితవు పలికారు. 'ఆపరేషన్ ఆక్టోపస్ 2.0లో భాగంగా 850 కేసుల్లో రూ. 150 కోట్ల మోసాన్ని గుర్తించామని, మ్యూల్ ఖాతాల ఓపె నింగ్ లో సహకరించిన 32 మంది బ్యాంకు అధి కారులను అరెస్ట్ చేశామని వెల్లడించారు .కంబోడియా, వియత్నాం, దుబాయ్ వంటి దేశాల నుంచి సాగుతున్న అంతర్జాతీయ సైబర్ ముఠాలు.. స్థాని క బ్యాంకు అధికారులతో కుమ్మక్కై ఈ నేరాలకు పాల్పడుతున్నాయని వివరించారు. కేవైసీ నిబంధ నలను ఉల్లంఘించే ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, వారిని బ్యాంకింగ్ రంగం నుంచే బ్లాక్ లిస్ట్ చేయాలని సూచించారు. బ్యాంకుల్లో 'మ్యూల్ ఖాతాలు' ఉంటే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. ముఖ్యంగా ఫిక్స్డ్ డిపాజిట్లను ముందస్తుగా క్లోజ్ చేసేందుకు వచ్చే కస్టమర్ల విషయంలో బ్యాంకులు అప్రమత్తంగా ఉండాలన్నారు.



## రూ. 8లక్షలతో అండర్‌డ్రైనేజీ నిర్మాణం

**ఆమనగల్లు, ఏప్రిల్23, ప్రభాతవార్త:** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 9వవార్డులో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.8లక్షలతో నూతనంగా అండర్ డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నట్లు స్థానిక కౌన్సిలర్ ఎర్రవోలు మహేశ్ తెలిపారు. కళ్యాణి గార్డెన్స్ సమీపం నుండి పాత హెచ్‌పి గోడౌన్ వరకు డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నట్లు ఆయన వివరించారు. ఈమేరకు గురువారం మున్సిపాలిటీ చైర్మన్ పత్యానాయక్, జాతీయ ఓబిసి కమీషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారీలు ముఖ్య అతిథులుగా హాజరై పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వీధులలో అండర్‌డ్రైనేజీ, సిసిరోడ్ల నిర్మాణాలు పూర్తి చేస్తామని చెప్పారు. ప్రజల ఆకాంక్షల మేరకు సమర్థవంతమైన పాలనతో మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాలు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో బిజెపిరాష్ట్ర కార్యవర్గ సభ్యులు కండె హరిప్రసాద్, ఎఎంసి మాజీ ఉపాధ్యక్షుడు గుర్రం కేశవులు, కౌన్సిలర్ మొక్తాల వెంకటయ్య, నాయకులు కండె భాస్కర్, వరికుప్పల శ్రీను, ఖాదర్, నేతాజీ గోలి శ్రీను, యాదగిరి, మహముద్, మాజీ కౌన్సిలర్ కృష్ణనాయక్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలి



విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డు అందజేస్తున్న సర్పంచ్, ఉపాధ్యాయులు

**కుల్కచర్ల, ఏప్రిల్, 23 ప్రభాతవార్త:** విద్యార్థుల చదువుల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అలవేలు అన్నారు. మండల పరిధిలోని పిరంపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో సర్పంచ్ గడ్డం వెంకటయ్య విద్యార్థుల తల్లి దండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గడ్డం వెంకటయ్య, పాఠశాల ఛైర్మన్ శ్రీలత జంగయ్య మాట్లాడుతూ..5వ తరగతి పూర్తి చేసుకొని 6వ తరగతికి వెలుతున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యంగా వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు చెరువులు, బావులకు ఈతకు వెల్తుంటారు. తలిదండ్రులు గమనించి పిల్లల పట్ల శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

## విద్యార్థులకు వేసవి యోగ శిక్షణ తరగతులు

**ఆమనగల్లు, ఏప్రిల్23, ప్రభాతవార్త:** వేసవి సెలవుల నేపథ్యంలో యోగ రత్న ఆచార్య రమేశ్ గురుజీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక యోగ శిక్షణ తరగతుల శిబిరం నిర్వహిస్తున్నట్లు యోగ గురుజీలు తాళ్ళ ఉమాపతిగౌడ్, రామాచారిలు తెలిపారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రజ్ఞ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 25నుండి తరగతులు ప్రారంభమవుతాయని వారు తెలిపారు. 7 నుండి 18సంవత్సరాలు వయస్సు కలిగిన విద్యార్థులకు ప్రవేశం ఉంటుందని చెప్పారు. అంతేకాకుండా ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి 7 గంటల వరకు పెద్దవారికి యోగ శిక్షణ ఇస్తున్నట్లు వారు వివరించారు. కాగా శిబిరంలో యోగతో పాటు మానవతావిలువలు, జీవిత సత్యాలు, బాధ్యత, నాయకత్వ లక్షణాలు, సేవలు, దైవత్వంపై అవగాహన కార్యక్రమాలు, తల్లిదండ్రులకు పాదపూజ వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. వివరాలకు 9440375608, 9666695395 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## బిటి రోడ్డు పనులు ప్రారంభం



బిటి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న చలివేంద్రంపల్లి రాజు

**జిల్లెడు చౌదరిగూడ, ఏప్రిల్ 23,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ధర్మ్యాతాండ బీటి రోడ్డు పనులను గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలకు ఎంతో ప్రాధాన్యతనిస్తుందని అన్నారు. గ్రామాలకు రోడ్డు సౌకర్యం బాగుంటేనే ప్రజలకు అన్ని సౌకర్యాలు బాగుంటాయని అన్నారు. బిటి రోడ్డు ఏర్పాటు చేయడం వల్లన తాండా వాసులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు చందునాయక్, చంద్రశేఖర్, రాంచంద్రయ్య, మార్కెట్ కమిటి డైరెక్టర్ వెంకటనర్సింహారెడ్డి, యాదయ్య, రవి, వెంకట్‌రాములు, గోపాల్‌రెడ్డి, సలీమ్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## భూసారం మేరకే ఎరువులు వాడాలి

**కుల్కచర్ల, ఏప్రిల్, 23 ప్రభాతవార్త:** భూసార పరీక్షల ఆధారంగానే అవసరమైనంత ఎరువులు వాడాలని శాస్త్రవేతలు డాక్టర్ వెంకటేశం, డాక్టర్ శివ రామన్, సూచించారు. గురువారం మండల పరిధిలోని గోరిగడ్డ తాండ గ్రామ పంచాయతీలో మండల వ్యవసాయ అధికారి వీరస్వామితో కలిసి రైతులకు సమతుల్య ఎరువుల వినియోగంపై (ఎన్‌పిఏఆర్‌ఎం) సంస్థ వారు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ...రసాయనిక ఎరవుల వాడకం వల్ల నేల, నీటి కాలుష్యం పెరగడంతో పాటు రైతుల పెట్టుబడి ఖర్చు వృథా అవుతుందన్నారు. సేంద్రియ, జీవన ఎరువులను వినియోగించాలి అన్నారు. తద్వారా పంట పెట్టుబడి తగ్గి, దిగుబడి పెరుగుతుందన్నారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా, నానో డిఏపి వంటివి వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అంబిక లాల్య నాయక్, వ్యవసాయ విస్తరణ అధికారి నిఖిత, ఉప సర్పంచ్ శోభ వార్డు సభ్యులు రైతులు పాల్గొన్నారు.



ఎరువుల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

## బస్తీ పిల్లలతో కె.ఎల్.ఆర్. జన్మదిన వేడుకలు

**జవహర్ నగర్, ఏప్రిల్ 23, ప్రభాత వార్త:** కీసర సర్కిల్ పరిధిలోని జవహర్ నగర్ జిహెచ్‌ఎంసి ప్రాంతంలో బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుతం మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కిచ్చన్న లక్ష్మారెడ్డి కె.ఎల్.ఆర్. 70వ జన్మదినాన్ని టీ కాలేష్–షర్మిల దంపతులు బస్తీ పిల్లలతో కలిసి ఘనంగా జరుపుకున్నారు. జవహర్ నగర్ ముస్లిం కమిటీ కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు టీ కాలేష్ తన సతీమణి షర్మిలతో కలిసి సుక్కమ్మ బస్తీలోని తమ నివాసంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా పిల్లలకు పండ్లు, పలహారాలు పంపిణీ చేసి, కేక్ కట్ చేయించారు. అనంతరం కె.ఎల్.ఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాలేష్ మాట్లాడుతూ, కె.ఎల్.ఆర్. ఆలోచనలతో ప్రభావితుడై ప్రతి సంవత్సరం ఆయన జన్మదినాన్ని కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకోవడం ఆనవాయితీగా మారిందని తెలిపారు. కష్టపడే వాడికే తినే హక్కు ఉంటుందనే ఆయన సిద్ధాంతం తనను ఆకట్టుకుందని పేర్కొన్నారు. పిల్లల ఆనందం దేవుని ఆశీస్సులాంటిదని భావిస్తూ, కె.ఎల్.ఆర్ ఆయురారోగ్యాలతో మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఆయన రాజకీయంగా మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ ముత్తుజ్ హైదర్, షేక్ అజ్మతుల్ హైదర్, నూర్జైన్ ఫాతిమా, సమీనా, సద్రీన్, జుబేరియా, ఉబేద్, ధన్విక, నిషి, రేవతి, అభిషేక్, అక్షిత తదితరులు



## రాష్ట్ర స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్ 17 క్రికెట్ జట్టుకు ఎంపికైన శ్రీచైత్రరెడ్డి



క్రికెట్ జట్టుకు ఎంపికైన శ్రీచైత్రరెడ్డి

**పెద్దేముల్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రికెట్ జట్టుకు శ్రీచైత్రరెడ్డి ఎంపికయ్యారు. పెద్దేముల్ మండల గిర్మాపూర్ గ్రామ రైతు పటేల్ రాంరెడ్డి కూతురు శ్రీచైత్రరెడ్డి తాండూరులోని మల్‌రెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతూ, జననీ క్రికెట్ అకాడమిలో గత మూడు సంవత్సరాలుగా శిక్షణ పొందుతున్నారు. ఈ నేపథ్యంలో గత ఏడాది మాదిరిగానే ఈ సారి కూడా స్కూల్ గేమ్ ఫేడరేషన్ ఆఫ్ అండర్ 17 క్రికెట్ పోటీలకువికారాబాద్ జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తూ రంగారెడ్డి జిల్లా జట్టులో ఇటీవల జరిగిన క్రికెట్ పోటీలలో ప్రతిభను కనబరిచి స్థానం సంపాదించింది. అనంతరం ఈ నెల 19 నుంచి 22 వరకు రంగారెడ్డి జిల్లా గుర్రం గూడాలోని జిఎన్ఆర్ గ్రౌండ్స్‌లో జరిగిన ఎస్‌జిఎఫ్ అండర్ 17 బాలికల క్రికెట్ తరపున ఆడింది. సెమీఫైనల్ జట్టులో కీలక పాత్ర పోషించిన శ్రీచైత్రరెడ్డిని పలువురు అభినందించారు. రాష్ట్ర జట్టు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీచైతన్యరెడ్డి జాతీయ జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ నెల 29 నుంచి చండిఘర్‌లో జరిగే జాతీయ స్థాయి అండర్ 17 స్కూల్ గేమ్ పేడరేషన్ క్రికెట్ పోటిలలో రాష్ట్ర జట్టు తరపున శ్రీచైత్రరెడ్డి పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీచైత్రరెడ్డి మాట్లాడుతూ తాను భారత జట్టు విజయానికి మార్గ నిర్దేశం కోసం కృషిచేసిన జిల్లా సెక్రటరి రామచంద్రుడు, పిడి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాఘవరెడ్డి తదితరులకు శ్రీచైతన్యరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

## అక్రమంగా తరలిస్తున్న 21 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

.. ఇద్దరిపై కేసు నమోదు..!
..గ్రామంలో రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే సహించేది లేదు
.. జూలపల్లి సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్

**తలకొండపల్లి మండలం (ఏప్రిల్ 23) :**
ప్రభుత్వం పేద ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని కొందరు అక్రమంగా విక్రయిస్తున్నారని తలకొండపల్లి మండలం జూలపల్లి గ్రామ సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్ పేర్కొన్నారు. తలకొండపల్లి మండలం జూలపల్లి గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాన్ని పట్టుకొని గ్రామ పంచాయతీకి తరలించి అధికారులకు తెలియజేయడం జరిగింది .స్పందించిన అధికారులు ఆర్ఐ శ్రవణ్, జీ పి ఓ నర్సింహా వాహనాన్ని తనిఖీ చేసి21క్వింటాళ్ల రేషన్ బియ్యం సంచులను గుర్తించారు. వాహనంలో తరలిస్తున్న డ్రైవర్, మరో ముగ్గురిని అదుపులోకి తీసుకొని, వాహనాన్ని పోలీస్ స్టేషన్ తరలించారు .విచారణలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్టుగా గుర్తించినట్లు వెల్లడించారు, అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సహకరించిన సర్పంచి శేఖర్ యాదవ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మండలంలో ఎవరు రేషన్ బియ్యంని అమ్మినట్లు తెలిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఆయన తెలిపారు. పేదలకు ఇచ్చే బియ్యాన్ని పక్కదారి పట్టించవద్దని హితవు పలికారు.

## వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్

-విద్యాభివృద్ధికి కాంగ్రెస్ సర్కార్ కట్టుబడి ఉంది
-ప్రైయివేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలే లక్ష్యం
-తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

**యాలాల ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** పాఠశాలల్లో కనీస మౌళిక సదుపాయాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయాల నిధులు వెచ్చిస్తోందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. విద్యాబివృద్ధికి కాంగ్రెస్ సర్కార్ ముందుంటుందని ఆయన వెల్లడించారు. గురువారం ఎమ్మెల్యే యాలాల మండలంలోని అగ్గనూర్, యాలాల, ముద్దాయిపేట గ్రామాల్లో పర్యటించి కోట్లాది రూపాయల నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. అగ్గనూర్‌లో రూ.42 లక్షల నిధులతో నిర్మాణం చేపట్టిన అదనపు తరగతి గదులు, సైన్స్ ల్యాబ్ భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం యాలాల మండల కేంద్రంలో రూ.20 లక్షల నిధులతో చేపట్టిన సిసి రోడ్డు, రూ.7లక్షలతో నిర్మాణం చేపట్టిన పాఠశాల ప్రహారీ గోడ పనులను ఆయన ప్రారంభోత్సవం చేశారు .ముద్దాయిపేట గ్రామంలో పంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయా గ్రామాలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి పాటుపడుతోందన్నారు. అగ్గనూర్ గ్రామ పాఠశాలకు అదనపు తరగతి గదులు మంజూరు చేయాలని పాఠశాల సిబ్బంది కోరగా త్వరలో నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైయివేటు పాఠశాలకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వం అందిస్తోన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను దశల వారిగా అమలు చేస్తోందని ఆయన భరోసా కల్పించారు.



యాలాలలో స్కూల్ ప్రహారీ గోడను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ, ఎమ్మార్వో, ఎంఇఒ, ఆయా గ్రామాల సర్పంచులు, పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే ఆయా గ్రామాల్లో నిర్మాణం పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇండ్లను సందర్శించి లబ్ధిదారులతో ముచ్చటించారు.

## మర్పల్లిలో భగీరథ మహర్షి జయంతి

**మర్పల్లి ఏప్రిల్23 ప్రభాతవార్త :** మర్పల్లి మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం నాడు శ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలు జరుపుకున్నారుయహర్షి చిత్రపటానికి పూలమాలలువేసి జయంతి వేడుకలను జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రామేశ్వర్ రవేందర్, రమేష్, మహేష్, తులదాస్, మల్లేశం, తిరుపతి ధనాగరాజ్, హరికృష్ణ, లక్ష్మన్, హిందువాహిని జిల్లా లధ్యక్ష్యులు రమేష్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.



భగీరథ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

## వయస్సు చిన్నది ఆలోచన చాలా పెద్దది

..(రాగి అంబలి)పంపిణీ చేసిన తిరుమణి సాన్విత్ గౌడ్
..వెల్జాల్ చలివేంద్రం దగ్గర రాగి అంబలి పంపిణి..

**తలకొండపల్లి ఏప్రిల్23, ప్రభాత వార్త:** మానవసేవ యే మాధవసేవ అంటూ అతి చిన్న వయసులో సాన్విత్ గౌడ్ ఆధ్వర్యంలో రాగి అంబలి పంపిణిచేశారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలోని ప్రధాన రహదారిపై తిరుమణి రాఘవేందర్ గౌడ్ ఏర్పాటు చేసిన చలివేంద్రం దగ్గర తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామ తిరుమణి పాండే గౌడ్ మనవడు సాన్విత్ గౌడ్ ఆధ్వర్యంలో వేసవి కాలం ప్రజల దాహర్తి తీర్చడానికి బాటసారులకు వాహనం దారులకు రాగి అంబలి పంపిణి అందజసారు. ఈ సందర్భంగా సాన్విత్ గౌడ్ మాట్లాడుతూ.... వెల్జాల్ గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు చేసిన రాఘవేంద్ర గౌడ్ మా బాబాయ్‌కి ప్రత్యేక ధన్యవాదాలు వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజల దాహర్తిని తీర్చడానికి నా పాకెట్ మనీ డబ్బులతో రాగి అంబలి పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఏర్పాటుచేసిన చలివేంద్రం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని గ్రామంలోని ఎస్ బి ఐ బ్యాంకు దగ్గరికి వచ్చిన ప్రజలు చల్లటి నీరు, మాజ్జిగా, అంబలి తాగి వారి దాహార్తిని తీర్చుకుంటున్నారు. గ్రామంలో గెలిచిన ఓడిన ప్రజా అవసరాలను తీర్చడమే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి కుమార్ గౌడ్, కుమ్మరి రవి, రాము, రాఘవేందర్, సాయిలు, పృథ్వి, తదితరులు పాల్గొన్నారు.



ప్రయాణికులకు అంబలి అందజేస్తున్న పిల్లోడు

## కోరంలేక వాయిదా పడ్డ కోఆప్షన్ ఎన్నిక

-సమాచార లోపమే కారణం

**ఆమనగల్లు, ఏప్రిల్23, ప్రభాతవార్త:** ఆమనగల్లు మున్సిపాలిటీ పాలకవర్గం కోఆప్షన్ సభ్యుల ఎన్నిక ఊహించని విధంగా వాయిదా పడింది. సమావేశానికి హాజరుకావలసిన కౌన్సిలర్ సభ్యులు కొంతమంది గైర్హాజరుకావడంతో కోరం లేక కమిషనర్ ఎన్నిక ప్రక్రియను వాయిదా వేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...ఆమనగల్లు మున్సిపాలిటీలో 15వార్డులకు గాను నాలుగు కోఆప్షన్ సభ్యుల నియామకం జరగవలసి ఉంది. బిజెపి6, కాంగ్రెస్ 2, ఎమ్మెల్యే ఎక్స్‌అఫిషియో1తోపాటు బిఆర్ఎస్ పార్టీకి 7గురు సభ్యులతో కలుపుకుని కోఆప్షన్ సభ్యుల ఎన్నికకు మొత్తంగా 16 ఓట్లు ఉన్నాయి. బిజెపి–కాంగ్రెస్ జట్టుకట్టి అధికారాన్ని చేజిక్కించుకున్నారు. రెండుపార్టీలకు కలిపి 9మంది సభ్యులు ఉన్నారు. మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్ ఛైర్మన్ పత్యానాయక్‌తో చర్చించి కోఆప్షన్‌మెంబర్ ఎన్నిక ప్రక్రియను ఏప్రిల్23 గురువారం ముహూర్తం ఖరారు చేసి నోటీసు జారీ చేశారు. ఉదయం 11గంటలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటుతో కోఆప్షన్ సభ్యుల ఎన్నిక చేపట్టనున్నట్లు ప్రకటించి అందరికీ సమాచారం చేరవేశారు. దీంతో కాంగ్రెస్‌పార్టీకి చెందిన ఛైర్మన్ పత్యానాయక్, బిఆర్ఎస్ పార్టీకి చెందిన 7గురు సభ్యులు సకాలంలో మున్సిపాలిటీ కార్యాలయంకు చేరుకున్నారు. చాలాసేపటి వరకు వేచి చూసిన కూడా 6గురు బిజెపి కౌన్సిలర్లు, ఎమ్మెల్యే సమావేశానికి రాకపోవడంతో చివరికి అధికారులు కోరం లేదని ప్రకటించి కోఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రక్రియను మరోతేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

**బిఆర్ఎస్ కౌన్సిలర్ల ఆందోళన....**

కోఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రక్రియను వాయిదా వేయడాన్ని నిరసిస్తూ బిఆర్ఎస్ పార్టీకి చెందిన 7గురు సభ్యులు ఆందోళన చేపట్టారు. ఛైర్మన్ ఛాంబర్ ఎదుట బైఠాయించి అధికార పక్షానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కోరంలో సగ భాగం సభ్యులు హాజరైన అధికారులు ఉద్దేశపూర్వకంగా ఎన్నికను వాయిదా వేయడం సరికాదని ఆపార్టీ కౌన్సిలర్‌ల నాయకుడు పాపిశెట్టి రాము అన్నారు. ఎన్నికలో పాల్గొనే 16 మంది సభ్యుల్లో 8 మంది సభ్యులు అందుబాటులో ఉన్నా ఎన్నికను ఎందుకు వాయిదా వేసినట్లు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో అక్కడే ఉన్న ఛైర్మన్ పత్యానాయక్ వెంటనే అక్కడి నుండి వెళ్ళిపోయారు. ఆందోళన చేసిన వారిలో బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు పాపిశెట్టి రాము, ఎనుముల రమేశ్, నాగిళ్ల జగన్, ఎంగలి భాగ్యలక్ష్మీరఘు, దుడ్డు ఆంజనేయులు, కాలె యశోదమ్మ, పుల్లారెడ్డి అనూష, మైనార్టీ నాయకులు సయ్యద్ ఖలీల్, సైదులుగౌడ్, ఎంగలి రఘు, జంతుక అల్లాజీ, శ్రీశైలం, శ్రీధర్ తదితరులు ఉన్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బిఆర్ఎస్‌పార్టీ కౌన్సిలర్లు

## సర్టిఫికెట్స్ దొరికిన వారు ఇవ్వండి

వేడుకొంటున్న చరణ్

**తలకొండపల్లి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండలం చుక్కాపూర్ గ్రామానికి చెందిన కాలూరి చరణ్ సుభాష్ చంద్ర అనే విద్యార్థికి చెందిన చదువుకున్న సర్టిఫికెట్స్ పోయాయని దొరికిన వారు తమకు అప్పగించాలని పలువురిని ఆయన వేడుకున్నారు. ఈనెల 20న తలకొండపల్లి మండలం చుక్కాపూర్ గ్రామం నుంచి అమంగల్ వైపు వెళ్తున్న షాద్నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో ఆమనగల్ వెళ్తుండగా తమ సరుకు సంబంధించిన టిసి( ట్రాన్స్ఫర్ సర్టిఫికెట్) మాయమయ్యాయని, 2023 24 సంవత్సరంలో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ గోవాలో బీటెక్ మొదటి సంవత్సరం పూర్తి చేశానని, దానికి సంబంధించిన టిసి సర్టిఫికెట్స్ బస్సులో మిస్ అయినట్లు ఆయన తెలిపారు. కాలూరు చరణ్ సుభాష్ చంద్ర పేరున చదువుకునే సర్టిఫికెట్స్ దొరికిన వారు 9652496041 ఫోన్ నెంబర్‌కు తెలియజేయాలని విద్యార్థి వేడుకున్నారు.

## దేవాలయం నిర్మాణానికి 2.5 లక్షల విరాళం



**తలకొండపల్లి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** నేటి సమాజానికి పాఠశాలలతో పాటు దేవాలయాలు ఎంతో ప్రాముఖ్యత చెందుతున్నాయని, దేవాలయాల నిర్మాణాన్ని కోసం భారీగా విరాళాలు అందజేస్తున్నారు. ఇటీవల తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామపంచాయతీ పరిధిలోగల సంగాయపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శివ ఆంజనేయ స్వామి దేవాలయానికి ఏకంగా 2.5 లక్షల రూపాయలు విరాళంగా ప్రకటించి అందరి మన్నలను పొందాడు. రాంపూర్ గ్రామానికి చెందిన మొక్తాల నర్సింలు గౌడ్ స్వగ్రామం రాంపూర్ అయినప్పటికీ హైదరాబాదులో ప్రవేట్ పాఠశాలను నడుపుతున్నాడు. గ్రామంలో అడపదడపా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నాడు. రాంపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల సంగాయపల్లి గ్రామంలో ఆంజనేయ స్వామి దేవాలయం లేకపోవడంతో గ్రామస్తులందరూ నర్సింలు గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన నర్సింలు గౌడ్ తన వంతుగా వ్యక్తిగతంగా 2 లక్షల 50 వేల రూపాయలు దేవాలయ నిర్మాణానికి అందించి అందరి మన్ననలను పొందాడు. దేవాలయానికి వ్యక్తిగతంగా అందించినందుకు గ్రామస్తులందరూ అతని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, రాంపూర్, సంగాయపల్లి గ్రామాల ప్రజలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



ఓఆర్ఎస్ పాకెట్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్

## ఎండ వేడిలో ఉపాధి కూలీలకు సాయం

..సర్పంచ్ ఆదర్శం

**పెద్దేముల్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** ఎండ తీవ్రత నేపథ్యంలో పెద్దేముల్ మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో ఉపాధిహామీ కూలీలకు సర్పంచ్ సి.బాల్‌రాజ్ ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేసి తమ ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ సి.బాల్‌రాజ్ మాట్లాడుతూ ఎండలో పనిచేసే కూలీల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. ఎండలో పనిచేసే కూలీలకు ఓఆర్ఎస్, మజ్జిగ ఎంతో అవసరమని, డీహైడ్రేషన్ నివారణలో వాటి పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు. కూలీల సంక్షేమానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని అన్నారు. సర్పంచ్ ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేయడం పట్ల కూలీలు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాలు, పంచాయతీ కార్యదర్శి వెంకటచైతన్య, వార్డు మెంబరు అశోక్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్ గృహకల్ప కాలనీలో ఇంటింటికి తిరిగి సమస్యలను అడిగితెలుసుకుంటున్న సిపిఎం మండల కార్యదర్శి సునీత తదితరులు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో పాల్గొన్న సర్పంచ్

**కుల్కచర్ల, ఏప్రిల్, 23 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల సొంతింటి కల సాకారం అవుతుందని సర్పంచ్ శాంతి తులసి రామ్ నాయక్ అన్నారు. మండల పరిధిలోని పటేల్‌చెరువు తాండ గ్రామ పంచాయతీ అనుబంధమైన కిచ్చన్నకుంట తాండలో ముడవత్ అనిత ఠాగూర్‌కి ఇందిరమ్మ ఇంల్లు మంజూరు కావడంతో నిర్మాణం పూర్తి చేసుకుని గురువారం గృహ ప్రవేశం నిర్వహించారు. ఈ గృహప్రవేశాలకు స్థానిక నాయకుతలో కలిసి వారి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రిబ్బన కట్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శాంతి తులసి రామ్ నాయక్ ..తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్లు చేపట్టిన పథకం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తికావడం లబ్దిదారులు నూతన గృహప్రవేశంచేయడం ఎంతో సంతోషంగా ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోపాల్ నాయక్, పంచాయతీ కార్యదర్శి ఆశోక్ కుమార్, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



గృహప్రవేశంలో పాల్గొన్న సర్పంచ్

## జలమహోత్సవంలో పాల్గొన్న సర్పంచ్ కవిత రాజు నాయక్

**కుల్కచర్ల, ఏప్రిల్, 23 ప్రభాతవార్త:** మండల పరిధిలోని దాశ్యానాయక్ తాండ గ్రామ పంచాయతీలో గురువారం జలమహోత్సం ఘనంగ నిర్వహించారు. ఈ జలమహోత్సంలో సర్పంచ్ కవిత రాజునాయక్ పాల్గొన్ని మాట్లాడారు..నీటి సంరక్షణపై వివరించారు. నీటిని వృథా చేయొద్దన్నారు .నీటి సంరక్షణలో అందరు పాల్పంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగిరథ డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనిర్ సుబ్రహ్మణ్యం అసి స్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిరణ్ కుమార్, మిషన్ భగిరథ ల్యాబ్ సిబ్బంది, మరియు ఉప సర్పంచ్ నూరి తుక్య నాయక్, పంచాయతీ కార్యదర్శి లనిత, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



జలమహోత్సవంలో పాల్గొన్న అధికారులు,



రాజీవ్ గృహకల్ప కాలనీలో ఇంటింటికి తిరిగి సమస్యలను అడిగితెలుసుకుంటున్న సిపిఎం మండల కార్యదర్శి సునీత తదితరులు.

## సమస్యలపై ఇంటింటి సర్వే చేపట్టిన సిపిఎం

**ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 23, ప్రభాత వార్త:** రాజీవ్ గృహకల్ప కాలనీలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరిం చాలని సిపిఎం మండల కార్యదర్శి ఎన్. సబిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోచారం డివిజన్ అన్నోజిగూడ రాజీవ్‌గృహకల్ప కాలనీలో సిపిఎం ఆధ్వర్యంలో గురువారం ఇంటింటి సర్వే చేపట్టి సమస్యలపై ఆరా తీశారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఇంటింటికి తిరిగి సిపిఎం నాయకులు అడిగి తెలుసు కున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రేండేళ్ల కాలంలో ప్రజలకు లబ్ది చేకూరింది శూన్యమని అన్నారు. రాజీవ్ గృహకల్ప కాలనీలో దాదాపు రెండు వేలకు పైగా కుటుంబాలు నివాసం ఉంటున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదని అన్నారు. దాదాపు 20 సంవత్సరాల క్రితం నిర్మించిన రాజీవ్ గృహకల్ప కాలనీలో బ్యాంకు అధికారులు బకాయిలు చెల్లించాలని తరచూ వేధింపులకు పాల్పడుతున్నారని అన్నారు. కొత్త పెన్షన్లు మంజూరు చేయలేదని అన్నారు. వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదని గ్యాస్ సబ్సిడి రావడం లేదని, గుంతలు పడిన రోడ్లతో కాలనీవాసులు కాలం వెళ్లదీస్తున్నారని అన్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించకపోతే ప్రభుత్వ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సినీయర్ నాయకులు చింతల యాదవ్, కె. అలివేలు, అరుణ, సునీత దేవి, అనసూయ, రాజిరెడ్డి, పద్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఖర్గే వ్యాఖ్యలపై భగ్గుమన్న బిజెపి

**మొయినాబాద్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై బీజేపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. గురువారం మొయినాబాద్ మండల కేంద్రంలో ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు జిల్లా అధ్యక్షుడు రాజు భూపాల్ గౌడ్ రాష్ట్ర ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ఇదే విధంగా నిరసనలు నిర్వహించినట్లు స్థానిక నేతలు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. ఖర్గే చేసిన వ్యాఖ్యలు అత్యంత అనుచితమని, దేశ ప్రధాని నరేంద్ర మోదీపై అవమానకరంగా మాట్లాడటం బిజెపి నాయకులను ఆర్ఎస్ఎస్ నాయకులను కొట్టి చంపాలని అసహ్యకరమని మండిపడ్డారు.



మండల కేంద్రంలో దిష్టిబొమ్మ దహనం

వెంటనే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలా చేయకపోతే తగిన రాజకీయ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ ఘటనతో మండల కేంద్రంలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నిరసన కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు పాడి గేదెలు మృతి..

**రైతును ఆదుకోవాలి: సర్పంచ్ ప్రవీణ్ రెడ్డి**

**మొయినాబాద్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** మొయినాబాద్ మండలంలో అకాల వర్షం ఓ కుటుంబానికి తీవ్ర దుఃఖాన్ని మిగిల్చింది. పిడుగుపాటుకు రెండు పాడి గేదలు మృతి చెందడంతో ఆ కుటుంబం జీవనాధారాన్ని కోల్పోయింది. బాధిత రైతును ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఎత్బార్‌పల్లి గ్రామ సర్పంచ్ ప్రవీణ్ రెడ్డి డిమాండ్ చేశారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని హెత్బార్ పల్లి గ్రామానికి చెందిన బుర్ర జంగయ్య (తండ్రి లక్ష్మయ్య) కొంతకాలంగా రెండు పాడి గేదలపై ఆధారపడి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం ఉదయం గేదలకు మేత వేసి వేప చెట్టు కింద కట్టేసి ఇంటికి వెళ్లిన జంగయ్య, మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో కూడిన అకాల వర్షం



కారణంగా తీవ్ర నష్టం చవిచూశాడు. గ్రామంలో కురిసిన వర్షంలో వేపచెట్టుపై పిడుగు పడడంతో, ఆ చెట్టు కింద ఉన్న రెండు గేదలు అక్కడికక్కడే మృతి చెందాయి. వర్షం ఆగిన తర్వాత సంఘటనా స్థలానికి వెళ్లిన జంగయ్య, గేదలు మృతిచెందిన దృశ్యం చూసి కన్నీరు మున్నీరయ్యాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ ప్రవీణ్ రెడ్డి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి, బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షాలతో ఇప్పటికే పంటలు దెబ్బతిన్నాయని, ఇప్పుడు పిడుగుపాటుతో పాడి గేదలు మృతి చెందడం రైతుకు తీవ్ర నష్టం అని అన్నారు. ఈ కుటుంబం పూర్తిగా గేదలపై ఆధారపడి జీవిస్తున్నందున ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి బాధిత రైతుకు పరిహారం అందించడంతో పాటు కొత్తగా రెండు గేదలను అందించి న్యాయం చేయాలని ఆయన కోరారు.

## సుదీర్ఘ కాలంగా కాంగ్రెస్ పార్టీకి పనిచేశా

**-మండల అధ్యక్షునిగా అవకాశం కల్పించండి**

**-కేశంపేట మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు రూపుల నాయక్**

**కేశంపేట, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీకి కరుడుగట్టిన కాంగ్రెస్ కార్యకర్తగా సుదీర్ఘకాలం పని చేశానని కాంగ్రెస్ పార్టీ కేశంపేట మండల అధ్యక్షునిగా అవకాశం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ మండల ఎస్టీసెల్ అధ్యక్షుడు రూప్ల నాయక్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఊహ తెలిసినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తగా, ఏకగ్రీవ సర్పంచ్ గా, ఆదివాసి అధ్యక్షుడిగా నాలుగు పర్యాయాలు ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా, ఉంటూ పార్టీకి సేవలు అందిస్తున్నానని మండలం లో అందరితో స్నేహభావ సంబంధాలు ఉన్నాయని, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని గిరిజన సామాజిక వర్గం నుండి అన్ని పార్టీల మద్దతు పూర్తిగా నాకు ఉందని పార్టీ ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని గిరిజన సామాజిక వర్గం నుంచి వచ్చిన నాకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పదవిని ఇస్తే శక్తి వంచన లేకుండా కాంగ్రెస్ పార్టీ కేశంపేట మండల పరిధిలోని గ్రామాలలో ప్రతి గ్రామంలో తిరుగుతూ పార్టీ బలోపేతం అయ్యేందుకు అహర్నిశలు కృషి చేశానని, రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకునేందుకు గ్రామాలలో నాకున్న పరిచయాలు ఎంతగానో దోహదపడతాయని, కాంగ్రెస్ పార్టీ ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని మండల పార్టీ అధ్యక్షుడు పదవి అవకాశాన్ని కల్పించాలని మండల అధ్యక్షుడు అయ్యేందుకు సీనియారిటీ తోపాటు అన్ని అర్హతలు ఉన్నాయని, ఈ విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి నాకు మండల అధ్యక్ష పదవిని ఇచ్చేందుకు కృషి చేయాలని ఆయన అన్నారు.



ఎమ్మెల్యే వీర్లపల్లిని కలిసిన కేశంపేట మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు రూపుల నాయక్

## టిబి రహిత సమాజమే లక్ష్యం

**-వైద్యాధికారి డాక్టర్ అమూల్య ప్రియదర్శిని**

**దౌల్తాబాద్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**

టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా బుధవారంరోజు దౌల్తాబాద్, మాటూర్ గ్రామాల్లో ఉచిత చాతి ఎక్స్ రే క్యాంపులు నిర్వహించారు. ఈ సంధర్భంగా డాక్టర్ అమూల్య ప్రియదర్శిని మాట్లాడుతూ.. హైరిస్క్ గ్రామాల్లో ప్రత్యేకంగా క్యాంపులు నిర్వహించి వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించ నిర్మూలించడమే తమ లక్ష్యమని తెలిపారు. జరుగుతుందని అన్నారు. మొత్తం 110 మందిని పరీక్షించగా, నలుగురిని టీబీ అనుమానితులుగా గుర్తించినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రఫీ, ఎస్‌టీఎస్ రాహత్, ఎక్స్ రే టెక్నీషియన్ రవి, ఎల్‌టి శ్రీధర్, ఏఎన్ఎంలు అనిత, అనురాధ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉచిత చాతి ఎక్సరే క్యాంప్‌లో మాట్లాడుతున్న వైద్యాధికారి

## త్వరితగతిన మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలి

..తెలంగాణ అడిషనల్ సిఇఓ వాసం వెంకటేశ్వర్
..స్పెషల్ ఇంటెన్‌సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా సమీక్షించిన వైనం
..2025ఓటరు జాబితాలోని అర్హులైన ఓటర్లందరిని 2002ఓటరు జాబితాతో అనుసంధానంచేయాలి
..పట్టణ ప్రాంత నియోజకవర్గాల్లో మ్యాపింగ్ ప్రక్రియ పూర్తిలో వెనకంజ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**

ఓటర్ల వివరాలు సేకరించి మ్యాపింగ్ ప్రక్రియను వారం రోజుల్లో పూర్తి చేయాలని తెలంగాణ అడిషనల్ సిఇఓ వాసం వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అయితే మేడ్చల్ జిల్లాలోని పట్టణ ప్రాంత నియోజకవర్గాల్లో మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయటంలో వెనకంజలో ఉందని వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. గురువారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం తూంకుంటలోని విశ్వవిశ్వాని కళాశాలలో స్పెషల్ ఇన్‌సెంటీవ్ రివిజన్ (ఎస్ఐఆర్) సమీక్షా సమావేశంలో మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన 11మంది సహాయ ఎన్నికల నమోదు అధికారులు (ఎఇఆర్ఓలు), బిఎల్ఓలు, సూపర్‌వైజర్లుతో సమీక్షా సమావేశంను ఆయన నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా తెలంగాణ అడిషనల్ సిఇఓ వాసం వెంకటేశ్వర్ మాట్లాడుతూ 2025ఓటరు జాబితాలోని అర్హులైన ఓటర్లందరిని 2002ఓటరు జాబితాతో అనుసంధానం చేయాలని సూచించారు. పట్టణ ప్రాంత నియోజకవర్గాల్లో మ్యాపింగ్ ప్రక్రియ చాలా నెమ్మదిగా జరుగు



మేడ్చల్ జిల్లా తూంకుంటలోని విశ్వవిశ్వాని కళాశాలలో అధికారులతో, సూపర్‌వైజర్లు, బిఎల్‌ఓలతో సమీక్షించిన తెలంగాణ అడిషనల్ సిఇఓ వాసం వెంకటేశ్వర్, పాల్గొన్న అధికారుల దృశ్యం

తుందని, బిఎల్‌ఓలు అందరు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలు సేకరించి త్వరితగతిన మ్యాపింగ్ ప్రక్రియను వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. మ్యాపింగ్ ప్రక్రియలో భాగంగా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన బిఎల్ఏల సహాయం తీసుకోవాలని, రెసిడెన్షియల్ కాలనీ వాసులతతో సమావేశాలు నిర్వహించి అందరినీ మ్యాపింగ్ అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఓటర్లు అందరు కూడ సహకరించి ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగ అందరు మ్యాపింగ్ చేయించుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు ఈఆర్ఓ, కీసర ఆర్డీఓ రాజేశ్‌కుమార్, నలుగురు డిప్యూటీ కమిషనర్లు, ఏడు మంది తహసీల్దార్లు, బిఎల్ఓ సూపర్‌వైజర్లు, పలువురు బిఎల్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ కోసం మానవహక్కుల సంఘానికి ఫిర్యాదు చేసిన లబ్దిదారుడు

**మోమిన్‌పేట్, ఏప్రిల్ 23. ప్రభాతవార్త:** ప్రభుత్వం నుండి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ ఇప్పటికీ అందకపోవడంతో సంబందిత భాధితుడు గురువారం మానవహక్కుల సంఘానికి పిర్యాదు చేశాడు. మోమిన్‌పేట్ మండలం కోల్కుంద గ్రామానికి చెందిన నవాబ్ రాఘవేందర్ రెడ్డికి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు కాగా ఇప్పటివరకు అట్టి చెక్కు అందలేదు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు వచ్చినట్లు లబ్దీదారునికి చరవాణి ద్వారా మెసేజ్ కూడా వచ్చింది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యధర్శి, కోల్కుంద గ్రామ సర్పంచ్ కరణం కీర్తి రామకృష్ణ, ఉపసర్పంచ్ మహేందర్ రెడ్డితో కలిసి తెలంగాణ రాష్ట్ర మానవహక్కుల సంఘానికి పిర్యాదు చేశారు. ఈ సంధర్భంగా సర్పంచ్ కరణం కీర్తి రామకృష్ణ మాట్లాడుతు ప్రభుత్వంనుండి మంజూరైన సిఎం సహాయనిధి చెక్కు అందక పోవడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఈ చెక్కు విషయంలో అక్రమాలకు పాల్పడ్డ సంబందిత వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. బాధితునికి సిఎం రిలీఫ్ ఫండ్ వెంటనే అందేలా చర్యలు తీపుకోవాలని మానవ హక్కుల సంఘాన్ని ఆమె కోరారు. లేని పక్షంలో ఇలాంటి సంఘటనలు పునావృతం కాకుండా చేసేందుకు వెనుకాడబోమని సర్పంచ్ కరణం కీర్తి రామకృష్ణ, ఉపసర్పంచ్ మహేందర్ రెడ్డిలు ప్రభుత్వానికి సవాల్ చేశారు.




తెలంగాణ మానవహక్కుల కమిషన్ పిర్యాదు చేసిన సర్పంచ్.

## 6 గ్యారంటీలు అమలు చేయండి: బిఆర్ఎస్

**దుద్యాల్, ఏప్రిల్ 23, ప్రభాత వార్త:** మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చాంద్ పాషా, విష్ణువర్ధన్ రెడ్డి, నరేష్ గౌడ్ పలువురు నాయకులతో కలిసి ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాళేశ్వరం పై కుట్రలు ఆపి రేవంత్ రెడ్డి పాలనపై దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై వేసిన ఘోష్ కమిషన్ నివేదిక చెల్లదని హైకోర్టు తీర్పునివ్వడం కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టు లాంటిది అన్నారు. కెసిఆర్ ప్రభుత్వం చేసిన మంచిని రేవంత్ రెడ్డి చెడుగా చూపించడమే పనిగా పెట్టుకున్నాడని విమర్శించారు. కొడంగల్ లో ఇసుక మాఫియా తో కాంగ్రెస్ పార్టీ నాయకులు జేబులు నింపుకుంటున్నారని అధికారులు, పోలీసులు చోద్యం చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు పూర్తి అయిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, 6 గ్యారంటీలను వెంటనే అమలు చేయాలన్నారు. బిఆర్ఎస్ హయాంలో 90 శాతం పూర్తయిన పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేసి సాగునీరు అందించాలన్నారు. కొడంగల్, నారాయణపేట లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేసి కొడంగల్ కు సాగునీరు అందించి నీకు ఓటు వేసి ముఖ్యమంత్రిని చేసిన కొడంగల్ ప్రజల రుణం తీర్చుకోవాలన్నారు. ఆంధ్ర కాంట్రాక్టర్లతో కమీషన్లకు కక్కుర్తి పడి నాసిరకం రోడ్లు వేస్తున్నారని ఆరోపించారు.



విలేకర్ల సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు

రేవంత్ రెడ్డి పాలనతో ప్రజలు విసిగిపోయారని 2023లో 1.48 ఓట్లతో అధికారం కోల్పోయామని 2028లో 100 సీట్లతో అధికారంలోకి వస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు బసప్ప, శ్యాసం వెంకటయ్య, పుర్ర రాఘవేందర్, బసి రెడ్డి, రమేష్, బుగ్గప్ప, సాయిలు, జహీర్, రాజు, అష్రఫ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ ఫామ్ సాగుతో అధిక లాభాలు



అంతారం గ్రామంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు ప్రభుత్వ సబ్సిడీలపై వివరించిన హార్టికల్చర్ అధికారి కీర్తి

**షాబాద్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** ఆయిల్ ఫామ్ సాగుతో రైతులకు అధిక లాభాలు చేకూరుతాయని హార్టికల్చర్ అధికారి కీర్తి అన్నారు. షాబాద్ మండల పరిధిలోని అంతారం గ్రామంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఆయిల్ పామ్ తోటల స్థాపన, నిర్వహణ, ఎరువుల వినియోగం, అధిక దిగుబడులు సాధించే విధానాలపై రైతులకు వివరంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చేవెళ్ల హార్టికల్చర్ అధికారి కీర్తి ఆయిల్ పామ్ సాగు ప్రాధాన్యతను వివరించారు. అలాగే ప్రభుత్వ పథకాలు, రైతులకు అందుబాటులో ఉన్న సబ్సిడీల గురించి స్పష్టంగా తెలియజేశారు. ఫీల్డ్ ఆఫీసర్ అభిలాష్ కుమార్ మాట్లాడుతూ రైతులు ఆయిల్ పామ్ సాగుపై ఉన్న సందేహాలను ఈ సదస్సు ద్వారా నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంతారం గ్రామ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ బుచ్చయ్య, ఉప సర్పంచ్ మహేందర్, గ్రామ నాయకులు పద్మారావు, ముజుబ్, జంగయ్య, ఆయిల్ పామ్ డిస్ట్రిక్ట్ టెక్నికల్ మేనేజర్ ప్రమోద్, గ్రామ రైతులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరిని మర్యాదపూర్వకంగా కలిసిన జర్నలిస్టులు

..జిల్లాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులందరికి అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలంటూ కోరిన వైనం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**

మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరిని జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. గురువారం మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులందరికి అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని కమిటీ సభ్యులు కలెక్టర్ ఛాంబర్‌లో ఆయనను కలిసి కోరారు. దీనికి కలెక్టర్ మనుచౌదరి స్పందించి ప్రభుత్వ జీఓ మేరకు తప్పనిసరిగా అర్హులందరికి అక్రిడిటేషన్ కార్డులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు, డిపిఆర్ఓ, ఐపిఅండ్‌పిఆర్ ఇంజనీరింగ్ అధికారి, తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించిన జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుల దృశ్యం

## ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు చేసుకోవాలి

**షాబాద్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ (రైతు రిజిస్ట్రేషన్) లో తన పేరును నమోదు చేసుకోవాలని షాబాద్ తహసీల్దార్ అన్వర్, మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర సూచించారు. గురువారం షాబాద్ రైతు వేదికలో ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై వ్యవసాయ విస్తరణ అధికారులు, మీసేవ కేంద్రాల ప్రతినిధులు, గ్రామపరిపాలన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ప్రతి పౌరుడికి ఆధార్ గుర్తింపు ఉన్నట్లే, ప్రతి రైతుకు 11 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య (ఫార్మర్ ఐడి) కేటాయించే కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. భూమి కలిగిన ప్రతి రైతుకు సంబంధించిన భూ యాజమాన్య వివరాలు, వ్యక్తిగత సమాచారం ఆధారంగా ఫార్మర్ రిజిస్ట్రీ రూపొందించబడుతుందని చెప్పారు. ముఖ్యంగా పిఎం కిసాన్ పథకం తదుపరి విడత లబ్ధి పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు తప్పనిసరి అని కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసినట్లు వెల్లడించారు. అలాగే రాబోయే వ్యవసాయ సీజన్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అయిన రైతు భరోసా, రుణమాఫీ, అలాగే మొక్కజొన్న, పత్తి, ధాన్యం కొనుగోలు, యూరియా ఇతర ఎరువుల పంపిణీ వంటి సేవలకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అవుతుందని తెలిపారు. రైతులు తమ ఆధార్ కార్డు, భూ యాజమాన్య పాస్‌బుక్, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో సమీప రైతు వేదికలోని వ్యవసాయ విస్తరణ అధికారిని లేదా సమీప మీసేవ కేంద్రాన్ని సంప్రదించి వెంటనే ఫార్మర్ ఐడి నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈనెల ఏప్రిల్23 నుంచి మే2 వరకు మండలంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు షాబాద్ మండలంలో పట్టాదారు పాస్‌బుక్స్ కలిగిన రైతులు 25,938 ఉండగా, అందులో 15,591 మంది రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు చేసుకున్నారని చెప్పారు. ఇంకా 10,437 మంది రైతులు నమోదు చేసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు శివతేజ, రాజేశ్వరి, లిఖిత, గీత, గాయత్రి, గ్రామ పరిపాలన అధికారులు, మీసేవ కేంద్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.



షాబాద్ రైతు వేదికలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ పై సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ అన్వర్, వ్యవసాయ అధికారి విజయచంద్ర.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ శ్రీనివాస్

## ప్రభుత్వ పాఠశాలకు పంపండి

**మర్పల్లి, ఎప్రిల్23, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లో, వసతి హాలలో ప్రభుత్వం విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపాలని ఎంపిడీఒచ శ్రీనివాస్, వార్డెన్ తుల్జారాంగౌడ్, డాక్టర్ నరేందర్‌రెడ్డి. అన్నారు. తెలంగాణ ప్రభుత్వం 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం నాడు మండలంలోని సిరిపూరం వసతి గృహంలో విద్యార్థుల తల్లి దండ్రుల, గీచర్ల సమావేశం నిర్వహించారు.

ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన భోజనంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని వచ్చె విద్యా సంవత్సరం వసతి గృహంలో ఎక్కువమంది విద్యార్థులను చేర్పించాలని వారు విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. ఈసమావేశంలో సిరిపూరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్ ,పాఠశాల సిబ్బంది వసతి గృహ సిబ్బంది పాల్గోన్నారు.

## ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

**నందిగామ తహసిల్దార్ సైదులు**

**నందిగామ, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** భూమి కలిగిన ప్రతి రైతు వ్యవసాయ విస్తరణ అధికారి లేదా సమీప మీసేవ కేంద్రాలను సంప్రదించి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని నందిగామ మండల తహసిల్దార్ సైదులు కోరారు. గురువారం నందిగామ మండల ఎమ్మార్వో కార్యాలయంలో మండలంలోని మీసేవ నిర్వాహకులతో సమావేశమయ్యారు. భూమి కలిగిన ప్రతి రైతుకు సంబంధించిన భూ యాజమాన్య వివరాలు, వ్యక్తిగత సమాచారం ఆధారంగా ఫార్మర్ రిజిస్ట్రీ రూపొందించబడుతుం దన్నారు. ప్రధానంగా పిఎం కిసాన్ పథకం, తదుపరి విడుదల లబ్ధి పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు తప్పనిసరిగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని తెలిపారు. రాబోయే వ్యవసాయ సీజన్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ పథకాలు రైతు భరోసా, రుణమాఫీ, మొక్కజొన్న, పత్తి ధాన్యం కొనుగోలు, యూరియా ఇతర ఎరువుల పంపిణీ ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అవుతుందన్నారు. రైతులు తమ ఆధార్ కార్డు, భూ యాజమాన్యం పాసుబుక్కు, ఆధార్ కు అనుసంధానమైన మొబైల్ నెంబర్ సమీపంలో ఉన్న వ్యవసాయ విస్తరణ అధికారి గాని లేదా మీసేవ కేంద్రాలను సంప్రదించి వెంటనే ఫార్మర్ ఐడి నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈనెల ఏప్రిల్ 22 వ తేదీ నుంచి 30 వ తేదీ వరకు మండలంలో ప్రత్యేక డ్రైవ్ ఉంటుందని ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మీసేవ నిర్వాహకులు మహేష్, చేగూరు మీసేవ నర్సింలు, శ్రీకాంత్ గౌడ్ తదితరులున్నారు.



నందిగామ ఎమ్మార్వో కార్యాలయంలో మీసేవ నిర్వాహకులకు సూచనలు ఇస్తున్న ఎమ్మార్వో సైదులు

## వేగంగా కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు

**దుద్యాల్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** పేదల సొంతింటి కళ కాంగ్రెస్ తోనే సాధ్యం అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అవుటి శేఖర్ అన్నారు. గురువారం దుద్యాల్ మండల పరిధి లోని నాన్యానాయక్ తండాలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ గృహప్రవేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు, ఆవాసం లేక ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామన్నారు. పేదలకు ఇండ్లు ఇవ్వడం అంటే ఒక కాంగ్రెస్తోనే సాధ్యం అవుతుందని అన్నారు. గతంలో పాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క ఇళ్లు కూడ మంజూరు చేయలేదన్నారు. త్వరలోనే రెండవ విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను చేపడతామన్నారు. మండల వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు చాలా వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాణిక్య నాయక్, పంచాయతీ కార్యదర్శి కిషన్, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవి నాయక్, నాయకులు సంతోష్ నాయక్, లస్మయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ గృహ ప్రవేశంలో నాయకులు

**ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలే యాదయ్య**



ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలే యాదయ్య, ఎలుగంటి మధుసూదన్ రెడ్డి.

**షాబాద్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** ప్రజా ప్రభుత్వంలో పేదోడి సొంతింటి కల సాకారమవుతోందని చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య అన్నారు. షాబాద్ మండలం కొమరబండ గ్రామానికి చెందిన మంగలి దీప్తి కుమార్ ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశానికి గురువారం రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి తో కలిసి ఆయన పాల్గొన్నారు. నిరుపేదల సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నెరవేరుతోందని అన్నారు. ప్రజా ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్దార్ నగర్ మార్కెట్ చైర్మన్ సురేందర్ రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, సర్పంచులు గోపాల్, ప్రభాకర్ రెడ్డి, మాణిక్యం, శాంతమ్మ యాదయ్య, స్వరూప మహేందర్ గౌడ్ పాల్గొన్నారు. అలాగే నాయకులు జనార్ధన్ రెడ్డి, మాధవ్ రెడ్డి, సుభాష్, వెంకటయ్య, నరచారీ, చెన్నారెడ్డి, సుభాష్ రెడ్డి, జంగయ్య, శేఖర్ తదితరులు హాజరయ్యారు.